

# యుగధర్మం

"రేపే ఫీజు కట్టాలన్నయ్యా. రేపు సాయంత్రంలోగా కట్టకపోతే పేరు కొట్టేస్తారు. సంవత్సరం చదువూ వృథా అయిపోతుంది, రేపయినా ఫీజు కట్టకపోతే." అన్నాడు గోపాలం అన్న రామమూర్తి ఇంటికి రాగానే.

రామమూర్తి కాయితాల కట్ట పెట్టెమీద పడవేసి చొక్కా విప్పి చిలక్కొయ్యకు తగిలించి మంచంమీద నడుం వాల్చాడు. నాలు గయిదు నిమిషాలవరకూ రామమూర్తి మాట్లాడలేదు.

"నిన్నే అన్నయ్యా. రేపు టరమ్ ఫీజు కట్టాలి" అన్నాడు మళ్లీ.

"పేదకుటుంబంలో పెద్దకొడుకై పుట్టటం కన్న, పెరట్లో అరటిచెట్టయి పుట్టటం మంచిది. అందులో తండ్రిలేని కుటుంబమైతే ఇంక వేరే చెప్పనక్కర్లేదు. తద్దినం పెట్టటం దగ్గర్నుంచీ తాతముత్తాతల నాటి పరువుమర్యాదలు కాపాడే వరకూ బాధ్యతంతా వాడిదే" అంటూ ఒక్క నిట్టూర్పు విడిచాడు రామమూర్తి. భార్య కాంతం మరిది వైపు జాలిగా చూడసాగింది.

"మానవజీవితం మహోత్కృష్టమయినప్పటికీ సృష్టికర్త ప్రతిజీవినీ ఒకేరీతిగా సృష్టించడు అన్నయ్యా. సాధక బాధకాలను అనుభవించటమే మహోత్కృష్ట మయితే ప్రపంచంలో ఇంత అశాంతే ఉండదు. ఎవరికి ఉండే బాధ్యతలు వాళ్ళకున్నాయి. కాని ఏజీవి అయినా క్షమాగుణం వుంటేనేకాని రాణించలేదు" అన్నాడు గోపాలం స్పష్టంగా.

"అవును. నీకు సంసారవిషయంలో బాధ్యత లేదు. నిర్విచారంగా జీవితం గడపగలవు. సంసారం ఏ స్థితిలోవున్నా ఈదుకుపోయేందుకు నేనున్నాను గనుక నీపాట్లు కనిపించటం లేదు. మనిషికన్న పశుపక్ష్యాదు లెన్నోరెట్లు నయం.

"ఆమాట నిజమే అన్నయ్యా. కాని అంతా అందల మెక్కితే అది మోసే దెవరు? మానవుడికీ పశుపక్ష్యాదులకీ అనేక విధాలయిన తేడా లున్నప్పటికీ అతిముఖ్యమైన పెద్దతేడా ఒకటి వున్నది. మానవుడికి డబ్బు కావాలి. మిగతా జంతువులకి డబ్బు అక్కర్లేదు. అందువల్లనే మానవుడి ఉచ్చస్థితికిగాని, పతనానికిగాని ధనమే ముఖ్యకారణం" అన్నాడు గోపాలం కొంచెం ఉద్రేకం కనబరుస్తూ.

"మీ మాటల కేంగాని, గోపాలం కాలేజీ జీతం ఇచ్చెయ్యండి. అప్పోసప్పో చేసి ఈ ఒక్క సంవత్సరం నెట్టేస్తే రేపు అతనూ నాలుగుడబ్బులు సంపాయిస్తుంటే మీకూ కాస్త అండగా వుంటాడు." అన్నది కాంతం భర్తవైపు చూస్తూ.

"పిల్లలిద్దరికీ బొత్తిగా బట్టలు లేవన్నావు కదా, కాంతం. మరిబట్టలుకావద్దూ" అన్నాడు రామమూర్తి భార్యవైపు చూస్తూ.

బి. ఎస్. ఆర్. కృష్ణారావు

"పోనీలెండి, బట్టలసంగతి తరువాత చూచుకోవచ్చు. ముందు కాలేజి జీతం కట్టండి. లేకపోతే సిద్ధాన్నం బోర్లతోసుకున్న ట్లవుతుంది. మరేం చేస్తాం, అలవికాని ఖర్చు వచ్చినపుడు సర్దుకోవాలికాని. ఎలాగోలాగ వున్న బట్టలతోనే కాలక్షేపం చేస్తాం లెండి;" అన్నది కాంతం చంకలో వున్న పిల్ల తల నిమురుతూ.

"ఎంత ఓర్పమ్మా వదినా నీకు. నీ దృష్టిలో నీపిల్లలూ నేనూ ఒకటేకాని భగవంతుడి దృష్టిలో కాదు. ఇంత అల్పసంతోషివి, పరోపకార బుద్ధికలదానివి కాబట్టే—నిన్నూ, నీ బిడ్డల్నీ, నీ భర్తనీ భగవంతు డీవిధంగా పరీక్షిస్తున్నాడు వదినా" అని ఒక్కసారి నిట్టూర్చాడు గోపాలం.

"పోనీలే గోపాలం. చదువు ముఖ్యమా, గుడ్డలు ముఖ్యమా? భగవంతుని దయవలన ఈ సంవత్సరం నెట్టేస్తే మనకష్టాలు కొంతవరకు గట్టెక్కుతాయి."

"అయితే ఫీజు కట్టక తప్ప దంటారా?" అన్నాడు రామమూర్తి, ఫీజుకట్టాలని తెలిసినప్పటికీ, డబ్బులేమివలన కలిగిన నిరాశను వ్యక్త పరుస్తూ.

"తప్ప దన్నయ్యా, కట్టాలి. లేకపోతే పేరు కొట్టేస్తారు" అన్నాడు గోపాలం కొంచెం కష్టంగా.

"సరే కానియ్యి" అంటూ స్నానానికి లేచాడు రామమూర్తి.

సగంబరువు వదిలినట్లుగా ఇద్దరివైపూ చూసి కాంతం వంటింట్లోకి వెళ్ళిపోయింది.

* * *

"ఏమిటి గోపాలం, ఆలోచిస్తున్నావ్? ఇవాళ కాలేజి లేదా?" అని అడిగింది కాంతం, గోపాలం దగ్గరకి వచ్చి.

"ఇవాళ రాజుగారి పుట్టినరోజు సెలవు, వదినా."

"డబ్బుకు మహా ఇబ్బంది పడుతున్నారు మీ అన్నయ్య. డబ్బు లేదనే విసుగుకొద్దీ వారేమయినా అన్నా మనస్సు కష్టపెట్టుకోబోకు గోపాలం. జీతం కట్టేశావా?"

"ఆ, నిన్ననే కట్టేశాను వదినా. నువ్వింతగా చెప్పాలా వదినా? మన సంసారపరిస్థితులు నాకు తెలియవనా. ఎవరికైనా డబ్బనే ఆరో ఇంద్రియం లేకపోతే పంచేంద్రియాలూ మొండికేస్తాయి.

"డబ్బుకు మీ అన్నయ్య పడే కష్టంచూస్తే ఒకొక్కప్పుడు విరక్తి కలుగుతుంది. కాని అనుభవించక తప్పదు. మీ తాతగారి హయాంలో ముష్టివాళ్ళకు గాదెల్లోనుంచి చేటలతో తోడి పోసేవాళ్ళట. అటువంటి పేరు ప్రఖ్యాతులుగల సంసారం ఈ స్థితి కొచ్చింది. శుభకార్యాలు జరిగితే బంధువులంతా పదిరోజులు ముందుగానే వచ్చేవారట. పదహారురోజుల పండుగ వెళితేనేగాని ఎవర్నీ వెళ్ళనిచ్చేవారు కాదుట. పొన్నుకర్ర పుచ్చుకుని ఆయన బజారువెంట వస్తుంటే అంతా గజగజలాడేవారుట. అంత పరువుగా బ్రతికేవారుట."

"వారు పేరుప్రతిష్ఠలకోసం అంత డాబు దర్పాలతో వున్నారు కాబట్టే ఈనాడు మన మీస్థితికి వచ్చాం, వదినా. తాతగారి నాన్న ఇంకా గొప్పగా బ్రతికి ఉండొచ్చు. ఆయన తండ్రి ఇంకా. ఆయన తాత మరింత. కాని, వదినా, రూపాయి రూపాయిగా వున్నంతవరకూ ఖంగున మోగుతూ మొద్దల్లేనే వుంటుంది. కాని దాన్ని నాలుగు భాగాలు చెయ్యి. అప్పుడు ఆ పావలా మోతా, అందచందాలూ, విలువా ఎలావుంటాయో ఆలోచించుకో. ఆ పావలానే మరి నాలుగు భాగాలు చెయ్యి. ఆ నాలుగో భాగాన్ని చూస్తే మూలనున్న ముసలమ్మకూడా అది లోకువగానే కనబడుతుంది ఆయా పాయి ముందు-అవునంటావా?" అన్నాడు గోపాలం నవ్వుతూ.

"అవును గోపాలం. ఆ మాట నిజమే. కాని బ్రతికిచెడ్డావా, చెడి బ్రదికావా అన్న సామెత చెప్పినట్లుగా- చెడి బ్రత కొచ్చుగాని, బ్రతికి చెడరాదు."

"అవును. ఇంగువ కట్టిన గుడ్డ వాసన పో దంటావు."

'యుద్ధం రోజుల్లో కన్నా ఇప్పుడు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. మాట్లాడితే ప్రజాప్రభుత్వమంటారు. ఏం లోకమో ఏమో."

"సవతితల్లి బీదరికంచేత శక్తి లేక నెయ్యి కాస్త తక్కువేసి అన్నం పెడితే- ఇంకేముంది, తల్లి చచ్చింది కాబట్టి ఆబిడ్డనట్లా ఏడిపిస్తున్నది

ఎప్పుడో దాని పొట్టన బెట్టుకుంటుంది, తిండి సరిగ్గా పెట్టక- అని దవడలు నొక్కుకుంటారు. అదే కన్నతల్లి వీపు చిట్లేటట్టుగా కాస్త తప్పుకే కొట్టినా, నెయ్యి అసలు వెయ్యకుండా అన్నం పెట్టినా - వాడిని మంచిదార్లో పెట్టటానికి కొట్టింది, ఆరోగ్యం పాడవుతుందని నెయ్యి వెయ్యలేదు— అని సమర్థిస్తారు. అది సమాజం వదినా. అలాగే ఎవరయినా."

'ప్రతిసంసారం ఇలాగే అఘోరిస్తున్నది గోపాలం. మనందరికీ మోక్షం ఎప్పుడో?"

"హూఁ! మోక్షం. భూమి దేని చుట్టూ తిరుగుతున్నది వదినా?"

"సూర్యుడి చుట్టూ."

"లేదు-భూమి డబ్బుచుట్టూ తిరుగుతున్నది. డబ్బు అధికారం చుట్టూ తిరుగుతున్నది. అధికారం నాయకుల చుట్టూ తిరుగుతున్నది. నాయకులు మనచుట్టూ తిరిగారు. ఇప్పుడు మన చేతులు వెనక్కి విరిచి కట్టి, నోళ్ళు మూయించి, వీటన్నిటి చుట్టూ మనల్ని తిప్పుతున్నారు. ఇప్పుడయినా తెలుసుకో వదినా" అన్నాడు ఉద్రేకంగా.

"సరేకాని, మీ అన్నయ్యకు పైనేమీ దొరకదా గోపాలం! వారి నడిగితే కేకలేస్తారేమోనని అడగలేదు. నీకు తెలియదా గోపాలం?" అన్నది ఆదుర్దాగా.

"వంశవృక్షం ఒక చక్రం లాంటిది వదినా. మనమంతా వాటి ఆకులం. తమ తమ పరువు ప్రతిష్ఠల్ని కాపాడుకోటానికి, సంఘంలో ఆధిక్యం గణించటానికీ మన తాతముత్తాతలు సర్వవిధాలా డబ్బు వ్యయం చేశారు. దాని ఫలితం మనం అనుభవిస్తూనే వున్నాం. వారెంత కీర్తివంతు లయారో మనమంత కీర్తివిహీనుల మయాం. డబ్బు సంపాదించాలంటే ఈరోజుల్లో మానాభిమానాలు తృణప్రాయంగా చూడాలి. అటువంటివారివే రోజులు. అభిమాన పడే వారివి రోజులు కావు. వారలా మగ్గిపోవలసిందే. అయినా గాని లేనివాడూ, ఉన్నవాడూ కూడా ఉన్నవాడికే పెడతాడు. కాబట్టి అభిమానం వదులుకుంటే డబ్బు అనేక విధాలుగా సంపాదించొచ్చు."

"అయితే మరి, మీ అన్నయ్య, ఆ జీతం రాళ్ళతో చాలక ఇబ్బంది పడేకన్నా, ఎలాగోలాగ తంటాలుపడి పైన నాలుగుడబ్బులొచ్చే ఉపాయం ఆలోచించ కూడదూ?"

"ఏ విషయంలోనైనా చొరవ వుండాలి వదినా. తెంపులేంది ఎటువంటి వాడయినా ఏదీ చేయలేడు. తెగించినవాడు అన్ని విధాలా బాగుపడతాడు."

"ఏం బాగుపట్టమో ఏమో-దినదిన గండం నూరేళ్ళఆయుర్దాయంగా ఉన్నది" అని పిల్లలతో వంటింట్లోకి వెళ్ళిపోయింది కాంతం.

ఆ రాత్రి భోజనా లయినతరువాత అన్న దమ్ములిద్దరూ చెరో మంచంమీదా చల్లగాలికి ఆరుబయట పడుకున్నారు. కాంతం పిల్లవాణ్ణి కాళ్ళమీద పడుకో బెట్టుకొని నిద్రపుచ్చుతున్నది.

"ఫీజు కట్టేశావురా?"

"ఆ, కట్టేశాను."

"ఈ సంవత్సరంతో ఇంక కాలేజీ పీడ వదలిపోతుంది. ఏమిటో, ఈ అర్థం లేని చదువులు. మనిషిని నిలువునా పీక్కుతినటం తప్ప మరేం లేదు. జీత మొచ్చి నాలుగు రోజులు కాలేదు. చేతిలో కానీ లేదు. చావలేక బతకటంగా వుందిగాని అంతకన్నా మరేం లేదు." అన్నాడు రామమూర్తి ఒక్క నిట్టూర్పు విడుస్తూ.


"అన్నయ్యా, ఒక్కమాట".

"ఏమి టది"?

"నీ ఉద్యోగం రెవెన్యూ డిపార్టుమెంటులో. కాని అనుభవ శూన్యుడివి. ఈ జీతంరాళ్ళతో చాలకుండా గిజగిజలాడుతూ ఎన్నాళ్ళీ యిలా తంటాలు పడతావు చెప్పు."

"నీ వనేది అర్థమయిందిరా. కాని ఆత్మగౌరవాన్నీ, మర్యాదనీ ఆరీతిగా వచ్చే డబ్బు రక్షించలేదు. బ్రతికిన నాలుగు రోజులూ ఫలానివాడు మంచివాడని అనిపించుకోవాలికాని, దోచుకుతిన్నాడని అనిపించుకోటం తగిన పని కాదని నా ఉద్దేశ్యం"

"ఆత్మగౌరవం - అవును, భార్యనీ బిడ్డల్నీ సంతోష పెట్టలేక పోయినా - బయటవారిని మటుకు సంతోష పెడుతూవుంటే ఆత్మగౌరవం



నిలబడుతుంది. ఇంట్లో ఈగల మోతా, బయట పల్లకీల మోతా వుంటేనేకాని, ఆత్మ గౌరవం నిలబడదన్న మాట."

"అవును. వాడి జుట్టుకీ వీడి జుట్టుకీ ముడిపెట్టి సంపాయించటం నా చేతగాని పని. పరిగెత్తి పాలు తాగేకన్న నిలబడి నీళ్ళు తాగటం నయం. విశ్వాసం లేకపోతే ప్రపంచమే లేదు. పురాకృత కర్మ అనుభవించక తప్పదు. ముందు ముందు మంచిరోజులు వాటంతట అవే రాగలవేమో ఎవరు చెప్పగలరు?" అన్నాడు రామమూర్తి, భార్యకేసీ, పిల్లలకేసీ జాలిగా చూస్తూ. అప్పుడతని కనుకొలకుల్లో నీరు తిరగటం గోపాలం గమనించక పోలేదు.

"భవితవ్యం గురించి భర్మహార్మ్యాలు నిర్మించుకుని వాటికోసం నిరాశగా ఎదురుచూట్టం మానవ సహజం. ఈ వెర్రిఊహాలు, పిచ్చినమ్మకాలు పోవాలన్నయ్యా. అంగబలం, అర్థబలం లేనంతవరకూ పరువు ప్రతిష్ఠలు ఎంతవున్నా అవి రాణించవు. డబ్బుతో ప్రతిష్ఠ దానంతట అదే వస్తుంది. ఏ విధంగా చూసినా పది రూపాయలు సంపాయించేవాడే పరువుప్రతిష్ఠలు కలవాడీ రోజుల్లో." అన్నాడు గోపాలం ఆవేశంతో.

"అవును, మీ తమ్ముడు చెప్పింది నిజం" అన్నది కాంతం.

"నీతో అవసరం వున్న ప్రజా హృదయం ఏది వాంఛిస్తుందో తెలుసుకొని ఆ వాంఛకు ఫలసిద్ధి కలగటానికి కృషిచేసి, పని అయినా కాకపోయినా వారిని నమ్మించటంలో కృతకృత్యుడివి కాగలిగితే డబ్బు దానంతటదే వస్తుంది. అగ్రనాయకులు కూడా ఈ రోజుల్లో ఈ పంథానే అవలంబిస్తున్నారు. నీ స్థితిలో నేనుంటే ఈపాటికి వేలు గడించేవాడిని. నిన్ను అన్నానని అనుకోబోకు అన్నయ్యా. మనకు తల్లీ, తండ్రీ, సెంటు పొలమూ ఏదీ లేదు. ఏదో విధంగా సంసారాన్ని ఈడదీసుకోకపోతే ముందు ముందు మరీ కష్టం. రెండు సంవత్సరాల ఈ లోపల వదినకు ఒక్కటి కొనిపెట్టగలిగావేమో చూడు" అన్నాడు గోపాలం. రామం హృదయం గతుక్కుమంది. ఏదో చెప్పబోయాడు. ఇంతలోకే మళ్ళీ గోపాలం—

"నీ ఉద్దేశ్యం బాహ్యదృష్టికి ఉదాత్తమైన నిర్దుష్ట వర్తనవలె గోచరించవచ్చు. కాని ఆవిధంగా కూర్చుంటే జీవితం గడవటం కష్టం. సంప్రదాయ సిద్ధమైన జీవితవిధాన మంటూ

జీవితాన్ని సుఖమయం చేసుకునే విధానాన్ని విస్మరించి, ఉద్యోగరీత్యా నలుగురిచేతా మంచి వాడని అనిపించుకుందామనే ఉద్దేశ్యంతో వృథా ప్రయాసపడుతూ జీవిత వాతావరణాన్ని నాశనం చేసుకుంటున్నావన్నయ్యా. అవినీతికి, స్వార్థపరత్వానికీ, అత్యాశకీ నిలయమైన ఈ వాతావరణాన్ని పారద్రోలటానికి కంకణం కట్టుకున్నానంటే నిన్నేమనాలో అర్థం కాకుండా వుంది. పై సంపాదనకి వీలున్నప్పుడు అది త్రోసిపుచ్చేవాడివని అనుకోలేదు. ఆలోచించుకో అన్నయ్యా" అన్నాడు గోపాలం.

"నువ్వు చెప్పింది కాదనను గోపాలం. కాని పరువు ప్రతిష్ఠలకోసం, ఆదర్శ సిద్ధికోసం మన పెద్దలు జీవితమంతా కృషి చేసి, ఫలానివారి వంశం అన్ని విషయాల్లోనూ నిప్పువంటిదని అనిపించుకున్నారు. అటువంటి వంశానికి ఆచ్ఛాదన కలిగించటానికి ప్రయత్నించే శోచనీయ స్థితికి రావటానికి నాకు మనస్సొప్పటం లేదు. కాని నువ్వు చెప్పిన విషయాలన్నీ ఆలోచించి ఆత్మపరిశోధన గావించుకుని, జీవితవిధానంలో పరివర్తన తీసుకురావటానికి ప్రయత్నిస్తాను. మధ్యేమార్గం ఇంకేదీ లేకపోతే నీవు చెప్పిందానికి అనుగుణంగా వుండటానికి ప్రయత్నం చేస్తాను."

మరి వారం పదిరోజుల వరకూ అన్నదమ్ములిద్దరూ ఈ ప్రసక్తే ఎత్తలేదు. తరువాత ఒక రోజున రామమూర్తి సాయంకాలం ఆఫీసు నుంచి వచ్చాడు. గోపాలం కూడా ఇంట్లోనే వున్నాడు. మామూలుకు భిన్నంగా రామమూర్తి ముఖంలో ఒక విధమైన కాంతిరేఖ ప్రస్ఫుటమయింది. బాహ్యంగా మామూలుగానే వున్నాడు. ప్రశాంతమైన అతని వదనంలో ఒక విధమైన ఆప్యాయమైన వెలుగూ, నేటికి ఈ లోకాన్ని అర్థం చేసుకున్నాను కదా అనే సంతృప్తీ కనబడసాగాయి. గోపాలాన్ని చూసి చిరునవ్వు నవ్వుతూ అన్నాడు—

"నా జీవితంలో ఈ రకమైన తొలిసంఘటన ఈరోజునే జరిగింది గోపాలం. కాని ఒకపక్క నేను చేసింది తప్పేమోనని బాధపడుతున్నాను."

"గ్రహించాను అన్నయ్యా. నీ పరేంగిత జ్ఞానం నా బోధనలతో ఈ రోజున విలుప్తమైందని విచారించబోకు. కొద్దికాలం పోతే అదే అలవాటవుతుంది" అన్నాడు గోపాలం తన ప్రయత్నం ఫలించిందనే సంతోషంతో.

"ఈ రోజున ఒకానొక విషయంలో ఒక పార్టీకి సహాయం చేసినందుకు ఏభై రూపాయలిచ్చాడు. మీ వదినా పిల్లలకు బట్టలపేచీ వదిలింది. అప్పుడే బట్టలు కూడా వాళ్లకు పట్టుకొచ్చేశాను. మీ వదిన పుట్టింటికి వెళ్ళి చాలా మాసాలయింది. బట్టలున్నాయి కాబట్టి వోసారి వెళ్ళి ఓ నెలరోజులపాటు వుండొస్తుంది. ఇవిగో, చూడు బట్టలు" అంటూ ఒక పొట్లాం చేతికిచ్చాడు. ఈ మాటలు విని కాంతం కూడా వచ్చి చూసింది. "తమ్ముడి బోధ అన్నకు నచ్చిందన్నమాట నేటికి" అన్నది కాంతం కొత్తబట్టలు చూస్తూ.

"ప్రయాణానికి బట్టలు అమిరాయి. ఇదివరకు దాకా ఈ నెపంతో మీ వాళ్ళింటికి వెళ్ళలేదు. ఈసారి వెళ్ళి ఒక నెలరోజులపాటు వుండి రండి, నువ్వూ పిల్లలూను" అన్నాడు రామమూర్తి. కాంతం సంతోషంతో భర్తవైపు చూసింది.

"డబ్బు విషయంలో నీలో కలిగిన అంతరాంతర కల్లోలాన్ని నేను ఏనాడో అర్థం చేసుకున్నాను అన్నయ్యా. కాని అది నీవే కనక ఇదివరకే అర్థంచేసుకుని వుంటే జీవితం అమూల్యమైందనీ, నిరాశకు తావివ్వకూడదనీ, ఏదో విధంగా ధనార్జనే మనవాడి జీవితాదర్శమనే సత్యం నీకు బోధపడి ఉండేది. నా ఉద్దేశాన్ని సమస్తేంద్రియాల చైతన్యంతో అర్థం చేసికో గలిగివుంటే ఇదివరకునుంచీ జరుగుతూన్న విషాద సంఘటనలు ఏనాడో తప్పేవి" అన్నాడు గోపాలం. రామమూర్తి మాట్లాడలేదు.

మరొక నెలరోజులు గడిచిపోయాయి. కాంతం పిల్లలతో పుట్టింట్లో వున్నది. ఒక రోజు సాయంత్రం రామమూర్తి తూలిపోతూ ఇంటి కొచ్చాడు. అతని ముఖంలో కత్తివేసినా నెత్తురుచుక్క లేదు. ముఖంలో అసలు చైతన్యమే లేనట్లనిపించింది. వస్తూనే ఒక ఆర్డరు కాయితం గోపాలం చేతిలో పెట్టి మంచంమీద

కూలబడ్డాడు. గోపాలం అర్డరు పొంతంగా చదివాడు. అంత గుండెనిబ్బరంగల మనిషికి కళ్ళనీళ్ళ పర్యంతమైంది.

"జడుస్తూ జడుస్తూ ఏపనయినా చేస్తే అది ప్రమాదానికి దారితీసే మాట వాస్తవమే. లక్షలకు లక్షలు దోచుకునేవారు అధికారంలో వుండడంనుంచి వారి అవినీతి పైకి రాదు. వచ్చే జీతంతో అయిదువేళ్ళలో చిటికెనవేలు కూడా లోపలికిపోటానికి చాలక అవస్థపడే తాజేదారు పది రూపాయలు తీసుకుంటే అది లంచగొండితనంకిందికి వస్తుంది. క్షణక్షణం ఎన్నో సున్నిత హృదయాలను గాయపరచటమే కాకుండా, నాశనంచేస్తూ కిలకిలా నవ్వుతూ తాము సంపాయించుకునే మూటలు సంపాయించుకుంటూనే వుంటారు. ప్రతి ప్రతికూలపవనాంకురానికీ నీలాంటి వారెందరో బలయిపోతున్నారు. ప్రపంచకంలో విషాదాలకి మూలకారణం తర్కం. తర్కం అనుమానాల నుంచి కలుగుతుంది. ఒకరినొకరు అర్థం చేసుకోలేకపోవటమే కాకుండా, ఒకర్ని మరొకరు నాశనం చేయటానికి తయారవటమే దీనికి మూలకారణం. మేధాశక్తి సామాన్యంగా దరిద్రులనే అంటిపెట్టుకు ఉంటుంది. ఈవిధంగా జరిగిందని విచారపడకు అన్నయ్యా. ఇంతకన్నా ఎక్కువ ఔన్నత్యానికి రావటానికే ఈ సంఘటన జరిగిందని అనుకోవచ్చు. సానుభూతిపరులకన్నా స్వార్థపరులే ఎక్కువ ఈ రోజుల్లో. ఒక్కవిషయంలో ఆలోచించి ఆలోచించి ఏభై రూపాయిలు తీసుకున్నందుకు నీమీద అభియోగం తేబడింది. ఫలితం ఉద్యోగం పోయింది. వేలజీతాలు వచ్చేవాళ్లు లక్షలు సంపాదించినా అది పైకిరాదు. లౌకికమైన ప్రలోభాలకి లోబడని నీలాంటి వ్యక్తులు ఇటువంటి పనిచేస్తే అత్యంత విషాదానికే దారి తీస్తుంది. ఇట్లా జరిగిందని విచారపడకు. ఒకణ్ణి నాశనంచేద్దామనే ఉద్దేశ్యంతోనే మానవుడు ఉగ్గుపాల నాటినుంచీ పైకి రావటం పరిపాటయిపోయింది ఈ రోజుల్లో. నీలాంటి స్వార్థత్యాగులకీ, ప్రలోభాలకి లోబడనివారికీ రోజులు కావు. ఈ విషయం వదిన వింటే ఎంత విచారించేదో. ఈ సంఘటన నీ స్వాభిమానాన్ని గాయపర్చవచ్చు. లంచగొండితనం పెచ్చుపెరిగి పోతోందని ఎలుగెత్తి చాటేవారంతా ఆచరణలో పెట్టినట్లయితే నీలాంటివారికి గౌరవం లభించేది. అంతా అంధకారాన్ని తిట్టుకొనేవారే కాని ఈ అంధకారాన్ని పాలద్రోలటానికి తగిన జ్యోతిని వెలిగించే స్తోమతకలవారు లేకపోతున్నారు. కొన్ని కొన్ని విషయాల్లో నిరాశావాదం ఆశావాదానికి దారితీస్తుంది అన్నయ్యా. ఈ ఉద్యోగం పోయిందని విచారపడకు. ఈమాత్రం సంపాదన ఎక్కడోఅక్కడ సంపాదించుకో లేకపోలేం. భిన్నాభిప్రాయాలుగల ఇద్దరు వ్యక్తుల మనస్తత్వాలమధ్య తట్టుకోలేక నీ ఉద్యోగం పోయింది. జీర్ణించిన సంప్రదాయాలూ, మాసికలు వేసిన నీతులూ, భగ్నమైన అభిమానాలూ ఈ రోజునుంచీ విడిచిపెట్టు. వాటి నసలు తలపెట్టకు. ఈ సున్నిత హృదయాన్ని వాటికోసం ఆహుతి చెయ్యకు. సన్మార్గాన్ని ఏవీ సంప్రాప్తం కాకపోయినా, ఆ మార్గాన్నే వాటిని పొందాలనే అభిప్రాయం మాని, అసలు సంప్రాప్తించని వాటిని ఆనందంతో విస్మరించి, ప్రతి విషాదాన్నీ చిరునవ్వుగా మార్చి, లోకమూ లోకంలోని ప్రజలూ నిన్ను వంచించాలని ప్రయత్నించినప్పుడు వారికి అందకుండా వారినే నువ్వు వంచించగల స్తోమతను సంపాదించుకో. నీలో ఈలాంటి తత్వం ఏమైనా మిగిలివున్నదేమోనని తరచి చూట్టానికే ఈ సంఘటన జరిగింది. ఈనాటినుంచీ నువ్వు ప్రభుత్వోద్యోగివి కావు. బాహాటంగా బ్రతకగల స్వతంత్ర జీవివి. ఇచ్చేది నల్భైఅయిదు రూపాయిలు, నాలుగువేల అయిదువందల రూల్సు. అడకత్తెరలో పోక చెక్కలా బ్రతికేకన్న నికృష్టమైన స్వతంత్ర జీవితం గడపటమే మేలు" అన్నాడు గోపాలం ఆవేశపూరితమయిన కంఠస్వరంతో.

"ఈ రోజుతో నా మూఢాభిప్రాయాలన్నీ వెనక్కి నెట్టేశాను గోపాలం. ఈ ఉద్యోగం లేకపోతే బ్రతకలేననే అధైర్యం ఈనాటినుంచీ నాకు లేదు. బురఖాలు తగిలించుకుని నాలాంటి వారిని మోసగించేవారిని ఆ బురఖాతోనే మోసం చెయ్యాలి" అన్నాడు స్పష్టంగా రామమూర్తి. ఈ మాటకిగోపాలం ఆశ్చర్యపోయాడు.